క్లుప్తంగా

నవధాన్యాలతో భూసారం


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

విజయనగరం రూరల్: పంట సాగు చేయక ముందు సాగు భూమిలో నవధాన్యాలను వేయడం ద్వారా జీవ వైవిధ్యం, కార్బన్ శాతం పెరిగి పంటకు కావలసిన సూక్ష్మ, స్థూల పోషకాలు అందుతాయని ప్రకృతి వ్యవసాయం ఆర్‌ఓ ప్రకాష్ అన్నారు. మండలంలోని జొన్నవలసలో పూసపాటి అప్పన్నబాబు మామిడి తోటలో 30 ఎకరాల్లో నవధాన్యాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులకు మామిడితోటలో నవధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారి హేమ సుందర్, ఎం.టి ఈశ్వరమ్మ ప్రకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరనిలోటు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రజా ఉద్యమ గాయకుడు గద్దర్ మృతి పీడిత ప్రజలకు తీరని లోటని అంబేడ్కర్ అందరివాడు సాధన సమితి ప్రతినిధులు బొంగ భానుమూర్తి, మల్లాన స్వాతి అన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్పనగర్ రమాబాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మధు, సతీష్, వాసు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


పూర్వ విద్యార్థులు

విజయనగరం అర్బన్: ఫ్రెండ్‌షిప్ డే ను పురస్కరించుకొని స్థానిక కేఎల్‌పురంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో మెంటాడ ఉన్నత పాఠశాల 1995 – 96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. సమాజానికి తమ వంతు తోడ్పాటునందించే విధంగా సేవా కార్యక్రమాలు చేసేందుకు నిర్ణయించుకున్నారు.

పోరాటానికి సిద్ధంకండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

విజయనగరం ఫూల్‌బాగ్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ చేపట్టనున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ పిలుపునిచ్చారు. విజయనగరం మండల భవన నిర్మాణ కార్మిక సంఘ 2వ మహాసభ ఆదివారం స్థానిక కేఎల్‌పురంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులు జగనన్న పథకాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రమాదవశాత్తూ కార్మికులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి పరిహారం అందడం లేదన్నారు. గతంలో మృతుల కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షలు, ఆడపిల్లకు సంబంధించిన శుభకార్యాలకు రూ. 20 వేలు చొప్పున ఇచ్చేవారని తెలిపారు. ప్రస్తుతం అవన్నీ రద్దయ్యాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు, నగర అధ్యక్షుడు జగన్‌మోహన్, పెయింటర్ సంఘ జిల్లా అధ్యక్షుడు కంది త్రినాథరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పాల్గొన్నారు. అంతకుముందు నగర కమిటీ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా జనార్ధన, కార్యదర్శిగా కంది త్రినాథ్‌తో పాటు 13 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

పర్యావరణ స్నేహితులు


మొక్కలు నాటుతున్న స్నేహితులు

చీపురుపల్లి: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ మిత్రులతో కలిసి ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ యువత మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతోనే జీవకోటి మనుగడ ముడిపడి ఉందని ఆయన అన్నారు. వై.లక్ష్మణ, రామకృష్ణ, చంటి, లోకేష్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సిల్ వెల్ఫేర్ సహాయంతో 38 ఒంటరి,పేద మహిళలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సత్యసాయి ట్రస్టు ప్రతినిధి రామ్మూర్తి మాట్లాడు తూ పేదలకు సహాయం చేసినప్పుడే నిజమైన సంతృప్తి లభిస్తుందన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పేదలకు సహాయపడాలని కోరారు. ఫర్‌దిపీపుల్ ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్, సభ్యులు శ్రావణ్‌కుమార్,గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్


- పౌష్టికాహార లోపం నిర్మూలనకు ప్రభుత్వం తాజా నిర్ణయం
- అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు ఊరట


గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు(ఫైల్)

భోగాపురం: మాతా,శిశు మరణాలను నియంత్రించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు టేక్ హోమ్ రేషన్ పేరిట పౌష్టికాహార సరుకులు ఇంటివద్దే అందించేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 18,228 మంది గర్భిణులు, బాలింతలకు రోజూ మధ్యాహ్నం భోజనం, కోడిగుడ్లు, పాలతో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇది వరకు గర్భిణులు, బాలింతలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి మధ్యాహ్నం భోజనం చేయాలనే నిబంధన ఉండేది. వివిధ రకాల కారణాలతో చాలా మంది గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం భోజనానికి రాలేకపోయేవారు. దీంతో వారు పౌష్టికాహారానికి దూరం కావడం వల్ల రక్తహీనత సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు వారి కుటుంబ సభ్యుల ద్వారా వారి ఇంటి వద్దకే టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ద్వారా 3 కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం, 25 కోడిగుడ్లు, అరకిలో పామాయిల్, 5 లీటర్ల పాలు, కేజీ కందిపప్పు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా 2 కిలోల రాగిపిండి, కిలో అటుకలు, పావుకిలో చొప్పున బెల్లం, ఎండు కర్జూరం, చెక్కిలు వంటి పౌష్టికాహార కిట్లను అందిస్తోంది. ఈ నిర్ణయం చాలా మందికి ఊరట కలిగిస్తోంది.


ప్రభుత్వం అందించిన టేక్ హోమ్ రేషన్ కిట్లతో గర్భిణులు, బాలింతలు (ఫైల్)

గర్భిణులు, బాలింతలకు ఊరట..



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్నం భోజనం, ఆకుకూరలు, పప్పుతో చేసిన వంటకాలను అందిస్తున్నాం. ప్రతిరోజూ మెనూ తప్పనిసరిగా అమలుచేస్తున్నాం. అయితే కేంద్రాలకు దూరంగా ఉన్న వారు, రాలేని పరిస్థితిలో ఉన్న వారు మధ్యాహ్నం భోజనానికి గైర్హాజరవుతున్నారు. అందరికీ పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దీంతో వారి ఇళ్లకే పౌష్టికాహార కిట్లను సరఫరా చేస్తున్నాం.

–బి. శాంతకుమారి, ఐసీడీఎస్ పీడీ

రక్తదాతలే ప్రాణదాతలు


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


రక్తదాతను సత్కరిస్తున్న కోలగట్ల, తదితరులు

విజయనగరం రూరల్: ఆపద సమయంలో ప్రాణాలను నిలిపే రక్తదాతలే ప్రాణదాతలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచి కార్యక్రమం తలపెట్టారని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుతో పాటు అధికారులు, ఉద్యోగులను అభినందించారు. రక్తదానానికి ముందుకొచ్చిన దాతలను ప్రశంసిస్తూ.. పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా 161 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు, ఆర్ఐ రవికిరణ్, కార్యాలయ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు..


ఆదినారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ ఎంపీటీసీ–2 సభ్యుడు పొంతపల్లి జగన్నాథరావు తండ్రి దివంగత పొంతపల్లి ఆదినారాయణ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ఆదివారం గ్రామానికి చేరుకుని ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మోదవలస వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్నింటి కృష్ణ తండ్రి కన్నయ్య కూడా ఇటీవల మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గ్రామానికి చేరుకుని కన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బొప్పడాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారుల సమక్షంలో నేరుగా లబ్ధిదారులతో మమేకమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో గణంకాలతో సహా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు లబ్ధిదారులతో మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అవినీతిరహిత పరిపాలనను అందిస్తున్నామన్నారు. గతంలో సంక్షేమ పథకాలు వర్తించాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే కాని పని జరిగేది కాదని గుర్తు చేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం నేరుగా ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడమే కాకుండా ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. కోవిడ్ కష్టకాలంలో ప్రజలు ఇళ్లకే పరిమితమైతే ప్రజలకు ఏ కష్టం రాకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కంటికి రెప్పలా కాపాడారని గుర్తు చేశారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, సర్పంచ్ అంబళ్ల కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తం, సీనియర్ నేత మత్స సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయం

కొత్తవలస: పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయంగా, వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో ఆదివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, స్థానిక, మండల ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాల కోసం ఎవరైనా లంచం అడిగారా అని ప్రజలను ఎమ్మెల్యే ఆరా తీయగా.. తమని ఎవరూ ఒక్కరూపాయి కూడా లంచం అడగలేదని ప్రజలు బదులిచ్చా రు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎవరైనా 11 రకాల ధ్రువపత్రాల కోసం దరఖాస్తుచేసుకున్నారా..? చేసుంటే ఆయా ధ్రువపత్రాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో ఏదో ఒక విధంగా గద్దెనెక్కాలని చంద్రబాబు నాయుడు, టీడీపీ నాయకులు బూటకపు హామీలు ఇస్తున్నారని, వారి మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అధికారంలో కోసం చంద్రబాబు చేస్తున్న కుట్రలు, దాడులను ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, ఎంపీటీసీ ఐతంశెట్టి నాగమణి, చింతలపాలెం మాజీ సర్పంచ్ పల్లా భీష్మ, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, ఐతంశెట్టి శ్రీనివాసరావు, జి.అప్పలరాజు, లక్ష్మణరావు, సాల్మాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అలవర్చుకోవాలి


వల్లూరులో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం

నెల్లిమర్ల రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని ఆ విభాగం చీపురుపల్లి సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనర్ బి. సత్యనారాయణ సూచించారు. మండలంలోని వల్లూరులో ప్రకృతి వనరుల విక్రయ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఏ పంటకైనా చీడ, పీడలను నివారించేందు బ్రహ్మాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల యాంకర్ వర్రి గాయత్రి, యూనిట్ ఐసీఆర్పీలు అంబళ్ల రామలక్ష్మి, దుర్గారావు, కృష్ణం నాయుడు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ నగర్ అభివృద్ధికి చర్యలు


శిలాఫలకాన్ని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: నగరంలోని 50వ డివిజన్ పరిధి వైఎస్సార్ నగర్‌లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పనకు స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి చర్యలు తీసుకుంటున్నారని నగర ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ తెలిపారు. వైఎస్సార్ నగర్‌లో సుమారు రూ. 55 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు రెడ్డితో కలిసి ఫ్లోర్ లీడర్ రాజేష్ మీడియాతో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఇప్పటికే రూ.1.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని.. అదనంగా మరో రూ.70 లక్షలు కూడా మంజూరయ్యాయని తెలిపారు. డివిజన్ పరిధిలో ప్రస్తుతం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగుతోందని, ఈ క్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత ఈ ప్రాంతంలో కాలువల నిర్మాణం పూర్తి చేస్తామని, అనంతరం రహదారులు నిర్మిస్తామని చెప్పారు. ఇళ్లు లేని నిరుపేదలకు గతంలో వైఎస్సార్ నగర్‌లో గృహాలు కేటాయించామని.. ప్రస్తుతం గుంకలాం, సారిక లే అవుట్లతో పాటు టిడ్కో గృహాలను పెద్ద ఎత్తున ఇస్తున్నామన్నారు. ఇంకా గృహాలు కావాలని దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని పరిశీలించి మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్పొరేటర్ పి.ఆదిలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనుయాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై హర్షం


స్వీట్స్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: ఎంపీ రాహుల్‌గాంధీపై ఉన్న నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు డీసీసీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్ మాట్లాడుతూ, మంచి మనిషికి మంచే జరుగుతుందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధీపై కక్షపూరితంగా వ్యవహరించినా అత్యున్నత న్యాయస్థానంలో న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఖరీం, షరీఫ్, అప్పారావు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

వైఎస్సార్‌సీపీ నాయకులు


11వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: నగరంలోని 11 డివిజన్ కాటవీధి రామ మందిరం నుంచి ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. అలాగే నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేయడంతో పాటు స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, అప్పారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టి దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరు నిలబెట్టుకున్నారని కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాభివృద్ధికి కంకణం కట్టుకొని ఆ దిశగా అడుగులు వేశారన్నారు. రానున్న రోజుల్లో నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు స్పందన

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ప్రజలు తమసమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.